# చంద్రగ్రహంలో

కొడవటిగంటి కుటుంబరావు

ఆరుబయట బడి జరుగుతున్నది. తివాసీలాగా ఉన్న గరికె మైదానంలో అధ్యాపకుడూ, పదిమంది పిల్లలూ కూచున్నారు. ఆకాశాన భూమి దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నది. ఆ రోజు భూమిపైన అమావాస్య.

"ఇవాళ మనం భూమిని గురించి కొంత తెలుసుకుందాము," అన్నాడు అధ్యాపకుడు. పిల్లలందరూ భూమి కేసి చూశారు. అధ్యాపకుడుకూడా భూమి కేసి చూస్తూ చెప్పసాగాడు :

"ఈ భూమి మనకు ఆరోగ్యవంతమైన కాంతిని ఇస్తున్నది. అందుకే మనం దానిని తల్లి అంటున్నాం. సూర్యుడు మనకు తండ్రి. అయితే సూర్యకాంతి మనకు ఎంతో హాని చేస్తుంది. మన యంత్రాలకు శక్తి నివ్వటానికి మాత్రమే అది పనికివస్తున్నది. సూర్యకాంతి వచ్చినప్పుడు మనం నేల ఇళ్లలోకిపోయి నిద్రపోతాం, లేదా గృహకృత్యాలు చూసుకుంటాం. అయితే మన శాస్త్రవేత్తలిప్పుడు సూర్యకాంతితో కొత్త ప్రయోజనాలను సాధించే కృషి చేస్తున్నారు. ఈ విషయం మీకు తెలిసినదే.

"మన పూర్వీకులు భూమిని గురించి అనేక అపోహాలు కలిగివుండేవారు. భూమి మండుతున్న గోళమనీ, ఆ మంటలు ఒక వైపునుంచి చల్లారుతూవచ్చి, మళ్లీ క్రమంగా గోళమంతటా వ్యాపిస్తాయనీ అనుకునేవారు. ఇది పొరపాటు. భూమిపైన పడిన సూర్యకాంతినే మనం చూస్తున్నామని శాస్త్రవేత్తలు రుజువు చేశారు. మనకు సూర్యగ్రహణం కలిగినప్పుడు భూమి మనకూ సూర్యుడికీ మధ్య అడ్డంవస్తుందనీ, దాని ఆకారం గోళాకారమనీ రుజువుచేశారు.

"ఈ భూమిపై ప్రాణులున్నాయా లేవా అన్న సమస్య మనల్ని చాలాకాలం బాధించింది. భూమిచుట్టూ ఒక విధమైన మిశ్రవాయువు ఉన్నది. ఆ వాయువు ప్రాణులకు చాలా అపాయకరమైనది. అందులో ఉన్న 'ఆక్సిజన్' అనేక పదార్థాలతో అతిసులువుగా సంయోగం పొంది వాటిని నుసిచేస్తుంది. ఈ కారణం చేత మన శాస్త్రవేత్తలు భూమిపై ప్రాణులున్నట్టు ఒకంతట నమ్మలేకపోయారు అయితే ఇప్పుడా అభిప్రాయం మారింది. భూమిపై ప్రాణులున్నమాట నిజం. అవి ఎలాటి ప్రాణులయినదీ మనకు తెలియదు. హీన ప్రాణులు కావచ్చు, మనలాగే వికాసం పొందిన ప్రాణులు కూడా అయి ఉండవచ్చు — ఇది వివాదాంశం.

"భూమిపైగల ప్రకృతి చాలా క్రూరమైనదనటానికి సందేహంలేదు. భూమిమీద మూడువంతులు ద్రవమేనని ఒకప్పుడు శాస్త్రజ్ఞులు తెలుసుకున్నారు. ఆ ద్రవాన్నిబట్టే భూమి చాలా వేడిగా ఉండాలని భావించారు. అయితే ఈ సిద్ధాంతానికి అభ్యంతరాలు ఏర్పడ్డాయి.

భూమి చల్లని గోళమే అయివుండి, అందులో ఎక్కువభాగం ద్రవమే అయితే అక్కడ జీవరాసులు ఎక్కువగా అభివృద్ధి అయేఆశలేదు. మనం దుర్భిణిలో నుంచి భూమికేసి చూసినట్టయితే భూభాగంమీద పొగలాటిది ఆవరించి ఉండటం కనబడుతుంది. ఈ పొగ మూలంగాకూడా జీవరాసులు సుఖంగా జీవించే అవకాశం లేదనాలి.

"ఇంతేగాక భూమి పైన అప్పుడప్పుడూ అగ్ని ప్రజ్వలించటం మన ఖగోళ శాస్త్రజ్ఞులు చాలాకాలంగా గమనిస్తూ వస్తున్నారు. భూమి వేడిగోళం కాదనటానికి ఈ అగ్ని ఒక అంతరాయంగా ఉంటున్నది. మన ప్రపంచంలోకూడా ఒకప్పుడు అగ్నిపర్వతాలుండేవని మనకు తెలుసు. అవన్నీ చల్లారినదాకా ఇక్కడ ప్రాణులు పుట్టలేదు. భూమిమీద మనం చూసేమంటలు అగ్నిపర్వతాలే అయితే అక్కడ ప్రాణికోటి ఎలా జీవిస్తున్నదో మనకు తెలియదు. ఇటీవల ఈ మంటలు చాలా తరుచుగా కనబడుతున్నాయి. వీటి మధ్య కూడా భూప్రాణులు బతుకుతూ ఉన్న పక్షంలో అవి రాక్షసప్రాణులై ఉండాలి.

"ఏమైనప్పటికీ భూమితాలూకు రహస్యాలు త్వరలోనే మనవాళ్ళు తెలుసుకోగలరు. ఎందుచేతనంటే మన వాళ్ళు భూమిపైకి వెళ్ళటానికి చేస్తున్న కృషి క్రమంగా సఫలమవుతున్నది. సూర్యరశ్మి సహాయంతో మనం తయారు చేస్తున్న కృత్రిమ ఘనపరమాణువుల సహాయంతో మన విమానాలు అంతరిక్షంలోకి చాలాదూరం వెళ్లివచ్చాయి. కొద్దికాలంలోనే మన విమానం భూమి చుట్టూ ప్రదక్షిణం చేసి తిరిగివస్తుంది.

"భూమిని మనం జయించగలిగినట్టయితే అందువల్ల కలిగే లాభాలేమిటో మీలో ఎవరైనా చెప్పగలరా?"

ఒక కుర్రవాడు ముక్కుమీద వేలుపెట్టుకుని తాను చెబుతానని సూచించాడు. అధ్యాపకుడు తలఊపాడు.

"మన ప్రపంచంలో ఉన్న అదనపు ప్రజలనూ, ఖైదీలనూ, సామ్యవాదం కోసం ఆందోళన చేసేవారినీ భూమి మీదికి పంపవచ్చు."

"అవును. ఇంకా?"

"వారిచేత శ్రమచేయించి భూమిపై గల సంపదను కొల్లగొట్టుకు రావచ్చు.

"చాలా బాగా చెప్పావు. ఒక్క సంగతి జ్ఞాపకం ఉంచుకోండి: మన ప్రపంచంతో పోల్చితే భూమి ఎంత బాధాకరమైన దైనప్పటికీ, అది మన గోళంకంటె చాలారెట్లు పెద్దది. అందులో అపారమైన ఘనపరమాణు పదార్థం ఉండవచ్చు. అదంతా మనకు లభ్యమైనట్టయితే మన విజ్ఞాన సంస్కారాలు అపారంగా పెంపొందుతాయి. ఈనాడింకా మన అగ్రజాతిలో నూరింట ఇరవైమంది ఏదోరూపంలో శ్రమిస్తున్నారు. ఇది మన చరిత్రకు పెద్దకళంకం. ఈ కళంకాన్ని తొలగించాలంటే మనం నభోంతరాళాన్ని జయించాలి. ముందు భూమీ, తరవాత ఇతర గ్రహాలూ మన అధీనంలోకి రావాలి. ఎవరుచూశారు? ఈ గ్రహాలలో వాసయోగ్యమూ, సుఖప్రదమూ అయిన గ్రహం ఒకటి ఉన్నట్టయితే మన సామ్రాజ్యానికి అదే కేంద్రంగా పెట్టు

కుని అగ్రజాతీయులం దాన్ని స్వర్గంగా చేసుకోవచ్చు. అక్కడినుంచే మనం విశ్వాన్నంతా పరిపాలించవచ్చు. ఎవరు చూశారు? మీ పిల్లలందరూ భూవాసులో కుజవాసులో, శుక్రవాసులో కావచ్చు!"

పిల్లలందరూ చప్పట్లు చరిచి ఆనందం ప్రకటించారు.

పాఠం ముగిసింది.

"మా నాన్న భూమిమీద నివేశన స్థలాలు అమ్ముతున్నాడు", అన్నాడు ఒక కుర్రవాడు అధ్యాపకుడితో.

"అలాగా? ఎంతమంది కొన్నారు?" అన్నాడు అధ్యాపకుడు ఆనందంతో.

"అప్పుడే పన్నెండు వందల స్థలాలు అమ్ముడయాయి."

"నా పేరకూడా ఒకటి రాయించి ఇమ్మన్నానని చెప్పు", అన్నాడు అధ్యాపకుడు.

"మా నాన్న భూమిపైన ప్రాణులను వేటాడటానికి బరువైన తుపాకులు తయారు చేస్తున్నాడు", అన్నాడు ఇంకొక కుర్రవాడు.

"మీ నాన్న కేమీ తెలీదు. మా నాన్న విషంపొడి తయారు చేస్తున్నాడు. దానిని చల్లినచోట ఉండే ప్రాణులన్నీ చచ్చిపోతాయి. ఆ తరవాత మనం దానికి విరుగుడు చల్లి దిగవచ్చు", అన్నాడింకొకడు.

"అబ్బాయిలూ, ఇప్పుడు ప్రాణినాశనానికి కొత్తపద్ధతులు వచ్చాయి. ముందు మారణ క్రిములు చల్లాలి. అవి జీవరాసులన్నిటినీ నాశనం చేశాక విరుగుడుమందు చల్లాలి. ఆ క్రిములన్నీ చచ్చాక మనం ఆ ప్రాంతంలో ప్రవేశించవచ్చు. ఈ క్రిములు ఇప్పుడు మన ప్రపంచంలో విరివిగా పెంచబడుతున్నాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే మన అగ్రజాతి అభ్యుదయానికి అవసరమైన కృషి సర్వతోముఖంగా కొనసాగుతున్నది. ఇది మనమంతా హర్షించదగిన విషయం."

చంద్రమండలంలో భూమినిగురించిన పాఠం అంతటితో పూర్తిఅయింది.

